క్లుప్తంగా

సీవీ రామన్‌కు నివాళులు



రామన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాయి రామకృష్ణ, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించి సర్ సీవీ రామన్‌కు నివాళులర్పించారు. హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి హెచ్ఎం వి.రాజు సైన్స్ అంశాలపై రంగవల్లుల పోటీలు నిర్వహించారు. రామన్ ప్రయోగాలను విద్యార్థులకు వివరించారు. సైన్స్ టీచర్ ఏఎల్‌వీ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, భద్రమ్మ, శేషారత్నం, జి.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచల పాదయాత్ర గురుస్వామికి సత్కారం



వాసుదేవ సుబ్బారావును సత్కరించిన నీలిమ శ్రీను

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామం నుంచి యేటా భద్రాచలం పాదయాత్రగా భక్తులను తీసుకు వెళ్తున్న గురుస్వామి వాసుదేవ సుబ్బారావును స్థానిక అమలకంటి శ్రీనివాసరావు(నీలిమ శ్రీను) శుక్రవారం సత్కరించారు. గొంచాల గ్రామంలో పంచాయతీ ఇచ్చిన స్థలంలో భద్రాద్రి రామాలయం నిర్మాణం పూర్తి చేసుకుని ఈ నెల 3వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనుండడంతో పట్టణంలోని ప్రముఖులను వాసుదేవ సుబ్బారావు ఆహ్వానించారు. ఈ మేరకు శ్రీనివాసరావు గురుస్వామిని సత్కరించి ఆలయానికి రూ. ఐదు వేలు విరాళంగా అందజేశారు.



రథోత్సవంలో ఆకట్టుకున్న బాణసంచా కాల్పులు



పిఠాపురం ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో స్వామి వారి రథోత్సవానికి వచ్చిన భక్తజన వాహిని



బాలా త్రిపుర సుందరి సమేత రాజశేఖర స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో కొత్తపల్లిలోని బాలా త్రిపుర సుందరి సమేత రాజశేఖర స్వామి

స్నానం సమర్పయామి..!

- కుక్కుటేశ్వరునికి త్రిశూలస్నానం
- కనుల పండువగా శ్రీపుష్పోత్సవం
- వైభవంగా తెప్పోత్సవం
- ముగిసిన కుక్కుటేశ్వరుని కల్యాణోత్సవాలు





శ్రీపుష్పోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి, కుక్కుటేశ్వరస్వామి వారు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి స్నానం చేయిస్తున్న అర్చకులు

పిఠాపురం: మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా పాదగయ క్షేత్రంలో శుక్రవారం కుక్కుటేశ్వరునికి వైభవంగా త్రిశూలస్నానం నిర్వహించారు. భక్త జన సందోహం నడుమ స్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్లకు వేద మంత్రాలతో స్నానం చేయించి పట్టు వస్త్రాలు అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్ పలువురు అర్చకులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం, పుష్పోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా పలువురు దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు.

దుర్గాడలో వైభవంగా ముగిసిన ఉత్సవాలు

ఆది దేవుడి వార్షిక కల్యాణాలు మానవాళిని అనుగ్రహింపజేశాయి. గొల్లప్రోలు మండలం దుర్గాడలోని రామలింగేశ్వరుని త్రిశూల స్నానం, శ్రీపుష్పోత్సవం వైభవంగా నిర్వహించగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించి తరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు స్వామివారికి అమ్మవారికి పూజా క్రతువులు నిర్వహించి 1100 కేజీల బియ్యంతో వండిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సుదీర్ఘంగా రథయాత్ర

స్వామి వారి రథయాత్ర గురువారం రాత్రి ప్రారంభమై శుక్రవారం తెల్లవారుజాము వరకు వైభవంగా నిర్వహించారు. ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో మేళతాళాలు, వేద మంత్రాల నడుమ వేలాది భక్తులు స్వామి వారిని రథంలో దర్శించుకున్నారు. బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా రాజశేఖర రథోత్సవం

కొత్తపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానికంగా ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత రాజశేఖర స్వామివారి రథోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వాహిచారు. స్వామివారికి అభిషేకాలు, నిత్యహోమం, బలిహరణ చేశారు. సాయంత్రం స్వామివారిని రథోత్సవంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో ఊరేగించారు. భారీగా బాణసంచా కాల్చారు. మండలంలోని భక్తులందరూ వచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు శర్మ, సుబ్రహ్మణం ఆధ్వర్యంలో నిర్వహించారు.



వైభవంగా త్రిశూల స్నానం



ప్రత్యేక అలంకరణలో సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమారారామ భీమేశ్వరస్వామి వారు



పంచారామ క్షేత్ర పుష్కరణిలో భక్తుల త్రిశూల స్నానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయ పుష్కరణిలో శుక్రవారం త్రిశూల స్నానం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 24న దీక్షా ధారణ చేసిన చెరుకూరి రాంబాబు దంపతులకు ఆలయ కోనేరులో ముందుగా ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మలు త్రిశూల స్నానం చేయించారు. అంతకు ముందు ఆలయంలో జరిగిన హోమంలో భక్త సంఘ నాయకులు బిక్కిన పరమేశ్వరసాయి, మలిరెడ్డి శ్రీనివాసరావు, తలుపుల అంజనీ కుమార్, బీవీ రమణ భక్తులకు సేవలందించారు. అనంతరం స్వామి వారి అమ్మవార్ల తీర్థపు సేవ జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షాపుల వద్దకు స్వామి వారిని అమ్మవార్లను పల్లకిలో తీసుకొని వచ్చి వారికి దర్శనం కల్పించారు. శనివారం రాత్రి స్వామి వారి అమ్మవార్ల శ్రీపుష్పయోగోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

ఈఓ బళ్ల నీలకంఠం అధ్వర్యంలో ఆలయ అర్చకులు అమావాస్య, ఫాల్గుణ మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని స్వామి వారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మూలవిరాట్, ఆలయంలోని ఉప ఆలయాలలో సైతం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంచారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

భువనేశ్వరీ పీఠంలో పూజలు

పెద్దాపురం: స్థానిక వర్జులవారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ చింతా గోపిశర్మ సిద్ధాంతి జన్మదిన వేడుకల్లో భాగంగా భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి ఆయనను సతీసమేతంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురం వెంకటరత్నం, పాలకుర్తి సతీష్, చార హనుమాన్‌శర్మ, రాముశర్మ తదితరులతో పాటు, భక్తులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురం గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ నాయకుడు చల్లా బుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది రోగులను పరీక్షిస్తారని, అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తారన్నారు. పంచాయతీ సమీపంలోని ఎలిమెంటరీ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలతో పాటు సమీప గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేట్లపాలెంలో నేడు అన్నదానం

సామర్లకోట: వేట్లపాలెం గోదావరి కాలువ ఆవలి వైపు ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి ప్రసాదం స్వీకరించాలని ఆలయ ధర్మకర్త కొండపల్లి రాంబాబు పిలుపు నిచ్చారు. ఆలయం వద్ద నిర్మించిన ముఖ ద్వారాన్ని గత నెల 17న ప్రారంభిం చారు. 25వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

ఘనంగా టైలర్స్ డే



విలియం హోవే జన్మదినాన్ని పురస్కరించుకుని నివాళులర్పిస్తున్న దర్జీలు

పిఠాపురం: అంతర్జాతీయ టైలర్స్ డేను శుక్రవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలులో జైగణేశా టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో టైలర్లు సూయింగ్ మెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు జైగణేషా టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు బత్తుల కొండల రావు, కార్యదర్శి కూరాకుల పాపారావు, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

విలియం హోవేకు నివాళులు

పెద్దాపురం: దర్జీల దినోత్సవం సందర్భంగా విలియం హోవేకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో సీనియర్ దర్జీలు ఆకాశపు బద్రరావు, గొర్రి రామ్మూర్తి, యిమ్మంది సత్యనారాయణలను యూనియన్ ఆధ్వర్యంలో సత్కరించారు. తొలుత దర్జీల దినోత్సంం పురష్కరించుకుని మెయిన్‌రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో దర్జీల సంఘం అధ్యక్షులు గుడివాడ కనకరత్నం, అల్లాడ రాఘవ, అల్లక వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణకు లబ్ధిదారులను గుర్తించాలి

- మెప్మా పీడీ ప్రియంవద



మహిళా సమాఖ్యల సమీక్షలో మాట్లాడుతున్న పీడీ ప్రియంవద



సామర్లకోట మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న పీడీ ప్రియంవద

సామర్లకోట: పేద కుటుంబాల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి వృత్తి శిక్షణలకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు బి.ప్రియంవద అన్నారు. శుక్రవారం స్థానిక మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల సమాఖ్యల రిసోర్స్ పర్సన్లతో ఆమె సమీక్షించారు. మహిళా సంఘాల రికవరీ 100 శాతం ఉండటంలో ఆమె వారిని అభినందించారు. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్, కార్పెంటర్లు, బ్యూటీషియన్లలో సేవా రంగాలల్లో శిక్షణకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులను సంఘాలుగా ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. మహిళా సంఘాల మాదిరిగానే పొదుపుతో వారికి అప్పులు లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. గృహ రుణాలలో లబ్ధిదారుల వాటా బకాయిలు ఎక్కువగా ఉన్నాయని ఆమె అన్నారు. అనంతరం స్థానిక సంత మార్కెట్‌లో నిర్వహిస్తున్న మెప్మా బజార్‌ను ఆమె సందర్శించారు. కార్యక్రమాల్లో మెప్మా సిటీ మిషన్ మేనేజరు సయ్యద్ హుస్సేన్, సీఓలు పి.ప్రసాద్‌బాబు, బి.వెంకటలక్ష్మి, డీఈఓ ఎం.రామోజీ, ఆర్పీలు పాల్గొన్నారు.

క్లబ్ ఫుట్ సేవల పర్యవేక్షణ

- జీజీహెచ్‌ను సందర్శించిన క్యూర్ ఇండియా ప్రతినిధి బ్రూస్



వైద్యులు, బాధిత చిన్నారుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రూస్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో క్లబ్ ఫుట్ (చిన్నపిల్లల్లో వంకర పాదాలు) సేవలను క్యూర్ ఇండియా సంస్థ ప్రతినిధి, అమెరికాకు చెందిన డాక్టర్ బ్రూస్ స్మిత్ శుక్రవారం పర్యవేక్షించారు. ఈ మేరకు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్స్ విభాగంలో బాధిత బాలల తల్లిదండ్రులతో స్మిత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో అందుతున్న సేవల నాణ్యత, ప్రయోజనాలపై ఆయన ఆరా తీశారు. డాక్టర్ విఠల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైద్య సేవలను బాలల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ విఠల్ మాట్లాడుతూ గడచిన ఏడేళ్లుగా క్యూర్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో వేలాది చిన్నారులకు పునర్జన్మనిచ్చామన్నారు. జీజీహెచ్‌లో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల వయసు చిన్నారుల వరకు వంకర పాదాలు సరిచేసే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ముఖర్జీ, పీజీ వైద్యులు, హౌస్ సర్జన్స్, క్యూర్ ఇండియా స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ శిరీష, జిల్లా ప్రోగ్రాం సమన్వయకర్త కిరణ్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.